క్లుప్తంగా

ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలి

రేపల్లె రూరల్: పట్టణంలో గ్యాస్ కంపెనీ రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని, పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిత్యం రద్దీగా ఉండే పద్మావతి సెంటరులో రిక్వెస్ట్ స్టాప్‌తో అనేక ప్రమాదాలు వాటిల్లుతున్నాయన్నారు. దీంతో పోలీసు శాఖ బస్సులతో పాటు ఏ ఇతర వాహనాలు ఈ సెంటరులో నిలుపుదల చేయరాదని హెచ్చరికలు జారీ చేశారన్నారు. ప్రస్తుతం నడుపుతున్న అన్న క్యాంటీన్ వద్దనే రిక్వెస్ట్‌స్టాప్ నడపాలన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



రేపల్లె రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి కార్యక్రమాన్ని జై గౌడ సేన జాతీయ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రేపల్లె పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభా యాత్రలో పలువురు గౌడ సంఘ నాయకులు పాల్గొని, ప్రసంగించారు. కార్యక్రమంలో జై గౌడ సేన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు మోర్ల వేణు గౌడ్, జిల్లా అధ్యక్షుడు కాగితా శ్రీనివాస్, రేపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు పీట మోహన్ సాయి, చెరుకుపల్లి మండలం కల్లుగీత సంగం అధ్యక్షుడు పీటా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీర ప్రతాప్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం కొల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ సిబ్బంది అడ్డగించి కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ జి. ఏడుకొండలు కేసు నమోదు చేశారు.

నేడు తెనాలిలో విఖనస జయంతి

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణి సత్యభామసమేత గోవర్ధనస్వామి ఆలయంలో ప్రతిష్టదైన విఖనస మహర్షి జయంతిని సోమవారం నిర్వహించనున్నారు. శ్రీ వైఖానస సేవాసంఘం ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్రావణ పూర్ణిమ రోజున వైఖానసులు మహర్షి జయంతిని నిర్వహిస్తుంటారు. తెనాలిలో ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, పంచామృత స్నాపన విశేష అర్చన కైకర్యాదులు నిర్వహించనున్నట్లు సేవా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి తెలిపారు లోకహితాన్ని కోరుతూ నారాయణ హోమం నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆచార్య స్వామి ఉత్సవమూర్తిని జింక వాహనంపై ప్రతిష్ఠించి పట్టణంలో రథోత్సవం ఉంటుందన్నారు. అనంతరం వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే సభలో తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం అధ్యాపకుడు దీవి ఫణి కుమార్‌కు బిరుదు ప్రదానం చేసి ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. వైఖానస ఆగమ విద్యను పూర్తి చేసిన ఆగమ విద్యార్థులు నారాయణం సంతోష్, వేదాంతం కమలేష్‌ను సత్కరిస్తామన్నారు. అర్చకుడు అగ్నిహోత్రం నరసింహమూర్తిని అర్చక పురస్కారంతో సత్కరిస్తామని వివరించారు.

జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

తెనాలిఅర్బన్: సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎ.అరుణకుమార్, ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మంలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూడటం దుర్మార్గం అన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి విశాఖ ఉక్కును సాధించుకోవడం జరిగిందన్నారు. వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యదర్శి ఎం.హనుమంతరావు, కృష్ణ, వెంకటేశ్వరరావు, కె.మహేష్, ఐ.రాజేష్ ఖన్నా, వి.విజయ్‌కుమార్, ఎస్.అనిల్, కె.సత్య, ప్రవీణ్, వెంకటేష్, రాజా పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకులు కె.వి. సాయిబాబాశర్మ, కృష్ణకుమారి గాత్ర ధారణలో స్వామి, అమ్మవార్ల భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై రామకృష్ణశర్మ, తబలాపై షణ్ముఖ శర్మ వాయిద్యా సహకారం అందించారు. కళాకారులను సత్కరించారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామదేవత శ్రీ దండి పార్వతి అమ్మవారికి శ్రావణ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, తీన్‌మార్‌లతో భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒకరికొకరు గులాలు చల్లుకుంటూ అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. గ్రామ స్మశాన వాటికలో కొలువైన శ్రీ గుండి పార్వతి, వెల్లటూరు లాకు సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదర్గ మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయంలో శ్రీ కనకదుర్గ అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ఈ నెల రోజుల పాటు లక్ష కుంకుమార్చన నిత్యం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవాని తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా



ప్రత్యేక అలంకరణలో గోగులమ్మ

దేవాలయాలను సుందరంగా తీర్చి దిద్దుతున్నారు.



అంకమ్మతల్లి అభిషేకానికి జలం తీసుకెళ్తున్న భక్తులు

పెదపులివర్రులో శ్రీ గోగులమ్మ, భట్టిప్రోలులో శ్రీ దండిపార్వతి, కోనేటిపురంలో శ్రీ గోగులమ్మ అమ్మవార్లకు సామూహిక పూజలు నిర్వహించారు. పాడి పంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సంవృద్ధిగా వర్షాలు కురవాలని, ఏటా అమ్మవార్లకు జాతరలు నిర్వహించడం ఆచారమని చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల కొలుపులు

కొల్లూరు : శ్రావణ మాసం గ్రామ దేవతల కొలుపులు మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కొల్లూరులో ఉప్పువారి అంకమ్మ తల్లి, రజకుల అంకమ్మ తల్లి, కోనవారి దేవరులను భక్తిశ్రద్ధలతో కొలిచారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు గ్రామంలోని కాలువ నుంచి ఊరేగింపుగా నీరు మోసుకు వెళ్లి అమ్మవార్లను అభిషేకించారు. పెసర్లంకలో మేళ తాళాల నడుమ గ్రామ దేవతల కొలుపుల ఘనంగా నిర్వహించారు. వర్షాలు సవ్యంగా కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవార్లను వేడుకున్నారు.

వైభవంగా పూజలు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): మండలంలోని పాత నందాయపాలెం గ్రామంలో ఈ నెల 22న కుంచల వారి ఇలవేల్పు పెద అంకమ్మ తల్లి, విఘ్నేశ్వరుడు, పోతురాజు, నాగ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనున్నారు. అందులో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమం చేపట్టి, గణపతిపూజ. పుణ్యాహ వచనం, మాతృశ్రీ పూజారంభం, ద్వార పూజ, తోరణ పూజలను అత్యంత వైభవంగా చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు



హోమం వద్ద భక్తులు

అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మట్టితో అలా సర్దేశారు

కొల్లూరు : ప్రయాణానికి పనికిరాని విధంగా తయారైన రహదారిలో గుంతలు కప్పెట్టేందుకు మట్టే దిక్కయ్యింది. అధికార కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు రాకపోకలు సవ్యంగా సాగేందుకు రోడ్డుపై ఏర్పడిన అగాధాలను రహదారి అంచుల వెంబడి పేరుకు పోయిన మట్టితో తాత్కాలికంగా పూడ్చే పనులు చేపట్టారు. మండలంలోని అవులవారిపాలెంలో ఆదివారం రాత్రి దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రంగా తనయుడు రాధ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలచౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు గుంతలను మట్టితో కప్పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. రోడ్డు అంచున పేరుకు పోయిన మట్టితో భారీ గుంతలు పూడుస్తుండటంతో వర్షాలు పడిన సమయంలో ద్విచక్ర వాహనాలు



కొల్లూరు-గాజుల్లంక రోడ్డులో గుంతలను మట్టితో సరిచేస్తున్న వైనం

జారీ ప్రమాదాలు చోటుచేసుకునే ముప్పు పొంచి ఉందని స్థానికులు అంటున్నారు. బురదలో ఇరుక్కుపోయి వాహనాలు ముందుకు కదలడానికి మొరాయిస్తాయని వాహనదారులు వాపోతున్నారు. అస్తవ్యస్తంగా మారిన రహదారి వ్యవస్థను ప్రజాప్రతినిధులు పరిశీలించి సత్వరం మెరుగుపరచాలని కోరతున్నారు.

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయ విధానం అవలంభించడం వల్ల తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని జీఎన్ పాలెం యూనిట్ ఐసీఆర్‌పీ చేబ్రోలు ఏసోబు తెలిపారు. మండలంలోని గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు దివాన్ తోటలో ఆదివారం 2,500 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రవ జీవామృతాన్ని తయారు చేసేందుకు రెండు కిలోల పప్పు దినుసుల పిండి, రెండు కిలోల నల్లబెల్లం, 10 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 150 లీటర్ల నీరు, గుప్పెడు పుట్టమన్ను అవసరమని తెలిపారు. వీటన్నింటినీ ప్లాస్టిక్ డ్రమ్ములో కలియబెట్టిన తర్వాత ఐదు రోజుల్లో ద్రవ జీవామృతం సిద్ధ



ద్రవ జీవామృతం తయారీ

మవుతుందని తెలిపారు. దీనిని వరి పైరుపై పిచికారీ చేయడం వల్ల భూమి గుల్లబారి సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో మొక్కలకు బలం చేకూరుతుందని వివరించారు.

నిబద్ధత కలిగిన సమాజ సేవకుడు ఓంకార్ ప్రసాద్

అభినందన సభలో వివిధ రంగాల ప్రముఖులు

తెనాలి: క్రమశిక్షణ, నిబద్ధతతో జీవితాన్ని నిర్మించుకుని సమాజసేవకు ఇతోధిక సేవ చేస్తున్న కటకం వెంకట ప్రసాదరావు (ఓంకార్ ప్రసాద్) ఆదర్శ ప్రాయుడని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభినందించారు. ఓంకార్ ప్రసాద్‌గా గుర్తింపును పొందిన ప్రసాదరావు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ, బాల్య మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అభినందనసభ నిర్వహించారు. ముత్యంశెట్టిపాలెంలోని ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కళ్యాణమండపంలో ఏర్పాటైన సభకు సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ చేనేత కార్మిక కుటుంబంలో జన్మించిన ప్రసాదరావు కష్టపడి పనిచేస్తూ ఉన్నత స్థాయికి ఎదగటం గర్వకారణమన్నారు. మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ బాధ్యత అనే పదానికి ఓంకార్ ప్రసాద్ చిరునామాగా చెప్పారు. కోస్తాంధ్ర పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జీవి రామకృష్ణ, జాతీయ ఉత్తమ



ప్రసాద్ దంపతులను సత్కరించిన అతిథులు

ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమమాహేశ్వరరావు, మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ, కె.రామమోహనరావు తదితరులు ఓంకార్ ప్రసాద్‌తో తమకు గల స్నేహాన్ని వివరిస్తూ, నూతన బాధ్యతల్లోనూ ఆయన రాణించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. మహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, గొట్టిముక్కల సుబ్బారావు, తిరువీధుల నాగేశ్వరరావు, శివశంకరరావు, రాచాబత్తుని బ్రహ్మం, రాచాబత్తుని శ్రీనివాసరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, జీఎస్‌బీ ప్రభాకరరావు, దివి పురుషోత్తం, కందుల నాగమల్లేశ్వరరావు, గోగినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు పాడిరైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అయితానగర్‌లోని ఎర్రబడి సెంటర్‌లో ఆదివారం మేకల అనసూయ అధ్యక్షతన పాడిరైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి, పంట రైతుకు రెండు కళ్లులాంటివని చెప్పారు. పంట దెబ్బతింటే పాడి మీద అయినా కుటుంబాన్ని పోషించుకోవచ్చనే ఆశతో ఉన్న పాడిరైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పశువుల ధరలు, వరిగడ్డి, పచ్చిగడ్డి, తవుడు, దాణా ధరలతోపాటు పశువుల మందుల ధరలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగాయని చెప్పారు. మహిళా పాడిరైతులు గ్రూపులుగా ఏర్పడి ఐక్యంగా ఉండాలని సూచించారు. వేజెండ్ల తబిత మాట్లాడుతూ



మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

గత 15-20 ఏళ్లుగా కౌలు వ్యవసాయంతోపాటు పశుపోషణ చేస్తున్న తమకు తగిన ఆర్థికసాయం చేయాలని కోరారు. మాన్యం శ్యాంబాబు మాట్లాడుతూ గోకులం, మినీగోకులం కింద షెడ్లు, దోమతెరలు వగైరాల కోసం సబ్సిడీ, సబ్సిడీయేతర సాయం ఇవ్వాలని కోరారు. కార్యాచరణ కోసం అయిదుగురితో కమిటీ ఏర్పాటుచేశారు. సీహెచ్ మార్తమ్మ, జి.అరుణ, మేకల ప్రకాష్, అత్తోట సరోజిని, జి.సునీత, తెనాలి ఝాన్సీ పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- గోరంట్ల కొండమీద పనుల పరిశీలన

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా యుద్ధప్రాతిపదికన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ నిలిచిన రిజర్వాయర్ పనుల్ని పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్ట్ వల్ల నీరందే ప్రాంతాలు, జనాభా, అంచనాలు, ప్రస్తుతం జరిగిన పనులు, ఇచ్చిన బిల్లులు, జరగాల్సిన పనులు, ఇతర అంశాల్ని ఇంజినీరింగ్ అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. నగరంలో విలీనమైన గ్రామాలకు అత్యంత ఆవశ్యకమైన గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ పనులు తక్షణమే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. పనులు ప్రారంభించిన తర్వాత బిల్లులు చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా ప్రజా ప్రతినిధులు ప్రాజెక్ట్ ప్రాధాన్యత, జాప్యంపై కౌన్సిల్ దృష్టికి తెచ్చారని చెప్పారు. పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వేగంగా జరిగేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. అనంతరం కొండ పక్కన ఉన్న కొండ బజార్‌లో ఆయన పర్యటించారు. తాగునీటితో పాటు ప్రజలు పలు



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

సమస్యల్ని ఆయన దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. వీధి దీపాల మరమ్మతులు, పైప్‌లైన్ లీకులు కూడా రెండు రోజుల్లో చేపట్టాలని తెలిపారు. డ్రెయిన్ల నిర్మాణం టెండర్ దశలో ఉందని, పనులు త్వరలో ప్రారంభం చేస్తామని ప్రజలకు ఆయన తెలిపారు. కొండ దగ్గరలోని క్రిస్టియన్ శ్మశానవాటిక లోలెవల్‌లో ఉందని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. నగరంలో రోడ్ల విస్తరణ సమయంలో వచ్చే మెటీరియల్‌ను శ్మశానంలో లెవల్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని యజమానులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ శ్యాంసుందర్, డీఈఈ హనీఫ్, సతీష్, ఏఈ అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కార్పొరేటర్ బాలాజీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు జరిమానా

నగరంపాలెం: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు సీజ్ చేసిన 198 వాహనాలకు ఆదివారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిమానా విధించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలపై వాహన తనిఖీలు చేపట్టామని అన్నారు. పిల్లలకు వాహనాలు అప్పగిస్తే ప్ర మాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నా యని పేర్కొన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా నేరాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: మండలంలోని సోమ సుందర పాలెం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 27,200, సెల్‌ఫోన్లు స్వాధీన పర్చుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలి



మంగళగిరి: రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు తమ పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. భూదందాలు, సెటిల్మెంట్లుకు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని చెప్పారు.

పెదపరిమిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

తాడికొండ: తుళ్లూరు మండలం పెదపరిమిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభించినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. సెంటర్‌లో బెంచీపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది పడిఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా వివరాలేమీ లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతుడు వయస్సు 60-65 సంవత్సరాలు ఉంటుందని, గత రెండు రోజులుగా గ్రామంలో సంచరిస్తూ మద్యం తాగినట్లు స్థానికులు తెలిపారు ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి బెంచీపై పడుకొని కదలకపోవడంతో స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో స్పందించిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుళ్లూరు ఠాణాలో సంప్రదించాలని సీఐ కోరారు.

శ్రీచౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక నల్లపాడురోడ్డు సాయినగర్‌లోని మహాగణపతి కుమారస్వామి సహిత చౌడేశ్వర చంద్రశేఖర సమన్విత చక్రాలయంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ కృతువు, కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు శ్రీవశిష్ట హరేరామ జపయజ్ఞ ఆశ్రమ పీఠాధిపతి శ్రీప్రణవానందగిరి స్వామి హాజరయ్యారు. పూర్ణకుంభ పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ సర్వాధికార ప్రతినిధి శ్రీవిశ్వంభరానందగిరిస్వామి, శాశ్వత ధర్మకర్త నరసింహారావు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

రేపల్లె రూరల్: మండలంలోని చాట్రగడ్డ శ్రీ ఎస్‌వీఎస్‌పీ హైస్కూలులో 1998-99లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనం ఆదివారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన బాల్య స్నేహితులు ఒక చోటుకు చేరి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి తమ గురువులను సత్కరించుకుని, గౌరవించారు.

లక్ష్మీనారాయణకు ఘన నివాళి

అమృతలూరు(భట్టిప్రోలు): సీపీఎం సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కొత్తపల్లి లక్ష్మీనారాయణ 4వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. అమృతలూరు గ్రంథాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి కుమార్తె, అల్లుడు రేణుక, వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం వేమూరు నియోజక కార్యదర్శి బి.అగస్టీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం లక్ష్మీనారాయణ అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు కోసం పోరాడారన్నారు. కమ్యూనిస్టుల స్ఫూర్తితో గ్రామాభివృద్ధి



లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు

కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లు సూర్యనారాయణ, కొత్తపల్లి భాస్కరరావు, గెల్లి సత్యనారాయణ, కొత్తపల్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● లోడ్ పట్టుతప్పితే.. ప్రాణాలు 'ఓవర్'



హైవేపై ఓవర్ లోడ్‌తో ప్రమాదకరంగా వెళుతున్న ఆటో

ప్రత్తిపాడు: ఇక్కడ కనిపిస్తున్న ఈ వాహనాన్ని చూడండి. చిన్న ఆటోపై ఎంత లోడు నింపారో! పెద్ద పెద్ద గోతాలను ఒకదానిపై ఒకటి కట్టి ప్రమాద భరితంగా నడుపుతున్నారు. మితిమీరిన లోడును వాహనంపై ఉంచడమే కాకుండా వేగంగా వెళుతుండటంతో పూర్తిగా పక్కకు ఒరిగిపోయింది. పొరబాటున పట్టు తప్పితే వెనుక వచ్చే ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసినట్లే. ఈ చిత్రం ప్రత్తిపాడు మండల పరిధిలోని యనమదల పదహారవ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం కనిపించింది. రవాణాశాఖ అధికారులు పూర్తిగా తనిఖీలను విస్మరించడంతో, కొందరు ఇలా ఓవర్ లోడ్‌తో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



భరతనాట్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

గుంటూరు రూరల్: నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డులో గల శిల్పారామంలో ఆదివారం పలు సాంస్కృతిక అంశాల్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకుల్ని కనువిందు చేసింది. నగరంలోని శ్రీ మంజునాథ నాట్య క్షేత్రం కళాకారులు భక్తి గీతాల నృత్య ప్రదర్శన నిర్వహించారు. కళాకారుల నృత్యాలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజర్ ఆర్. మనోజ్ఞ, ప్రదీప్, శిల్పారామం ఏవో శ్రీనివాస రెడ్డి, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.